APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 06, జూలై 2026 సంపుటి: 01 సంచిక :40 పేజీలు : 04 వెల: 2-00/-



## 14 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

బెంగళూరు, జులై 5 : కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లా పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 14 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొనగా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కలలు కన్న సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని ప్రతి పౌరుడికి అందించడం ప్రభుత్వాలే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు, న్యాయం, గౌరవం కల్పించడమే అంబేద్కర్ ఆశయమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ చూపిన మార్గాన్ని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

జిల్లా పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ భారీ కాంస్య విగ్రహం రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను నిరంతరం గుర్తు చేసే స్ఫూర్తి చిహ్నంగా నిలుస్తుందని డీకే శివకుమార్ తెలిపారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ మూల సూత్రాలను భావితరాలు గుర్తుంచుకునేలా ఈ విగ్రహం ప్రేరణ కల్పిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.

# సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు

- విశాఖ తీరం నుంచి వేటకు వెళ్లిన బోటు ఆచూకీ కోసం గాలింపు
- కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- గాలింపు వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం





విశాఖపట్నం, జులై 5 : అల్పపీడన ప్రభావంతో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం కోస్టుగార్డు, భారత నౌకాదళం, మెరైన్ పోలీసు విభాగాలు సంయుక్తంగా విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారుల వివరాల ప్రకారం, ఈ నెల 1వ తేదీ సాయంత్రం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి '×చీణూరా-ఖా-వీవీ-83' అనే బోటులో ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. జులై 4 మధ్యాహ్నానికే తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు వారి బోటు గానీ, మత్స్యకారులు గానీ ఆచూకీ లభించలేదు.

గల్లంతైన వారిలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన చిన్న, గరగయ్య, అప్పలరాజు, కె. చిన్నయ్య, సీతోడు, భీమిలి మండలం పెదనగమయ్యపాలేనికి చెందిన బండయ్య, విశాఖకు చెందిన చిన్న అమ్మోరు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫోన్‌లో సంప్రదించగా శనివారం మధ్యాహ్నానికి తీరానికి చేరుకుంటామని చెప్పినప్పటికీ, ఆ తర్వాత నుంచి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గంగవరం సముద్ర తీరానికి సమీపంలో బోటులో సాంకేతిక లోపం తలెత్తి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం కోస్టుగార్డు నౌకలు, నేవీ బృందాలు, మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళ హెలికాప్టర్‌ను కూడా రంగంలోకి దించి విస్తృత గాలింపు కొనసాగిస్తున్నారు.

కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గాలింపు చర్యలను మరింత సమన్వయంతో చేపట్టాలని మెరైన్ ఐజీ, విశాఖ పోలీసు కమిషనర్‌కు ఆదేశించారు. ఆపరేషన్ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సూచించారు. అదే సమయంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం యుద్ధప్రాతిపదికన గాలింపు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.




## ఆంధ్రప్రదేశ్‌కు మీరే బ్రాండ్ అంబాసిడర్లు - నారా లోకేశ్

- సియోల్‌లో తెలుగు డయాస్పోరాతో సమావేశం
- రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని పిలుపు
- కొరియా పెట్టుబడులకు ఏపీ ఉత్తమ భాగస్వామి

సియోల్ (దక్షిణ కొరియా), జులై 5 : దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. విదేశాల్లో నివసిస్తున్న ప్రతి తెలుగు వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి గాథను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ విదేశాల్లో విజయం సాధిస్తున్న ప్రతి తెలుగు వ్యక్తి ఆంధ్రప్రదేశ్ గర్వకారణమని అన్నారు. మీరు వ్యాపారాల్లో, ఉద్యోగాల్లో, వివిధ రంగాల్లో

# కాళేశ్వరం వద్ద బీఆర్ఎస్ ఆందోళన

జయశంకర్ భూపాలపల్లి, జులై 5 : కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ తన నిరసనను మరింత ఉధృతం చేసింది. ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలోని పార్టీ బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది. పోలీసులు ఏర్పాటు చేసిన కంచెలను దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్, అక్కడి పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా నిలిచేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సాంకేతిక సమస్యలను సకాలంలో పరిష్కరించకుండా రైతులకు సాగునీరు అందించే అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రాజకీయాలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు.

వృథాగా పోతున్న నీటి వద్దనే నిలబడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, దానిని విస్మరించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యాయి.

పంప్‌హౌస్ పరిసరాల్లో భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని



అదుపులో ఉంచేందుకు పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకుల పర్యటన ప్రశాంతంగా ముగిసేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, దీనిపై తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భారీ ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగించడమే రాష్ట్ర ప్రయోజనమని పేర్కొన్నారు.

# వాయుగుండం ప్రభావం.. భారీ వర్షాల హెచ్చరిక



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈ వ్యవస్థ ఒడిశాలోని బాలాసోర్‌కు దక్షిణ--ఆగ్నేయ దిశలో కేంద్రీకృతమై ఉందని, రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం వాయుగుండం పశ్చిమ--వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి--దిఘా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. అనంతరం ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు పయనించనుందని పేర్కొంది. దీని ప్రభావంతో అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు స్థానిక అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించింది. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని కోరింది.

# నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

పుట్టపర్తి, జూలై 5 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు సురక్షిత వాతావరణం



కల్పించేందుకు పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు ఈ చర్యలు అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ముఖ్యమైన కూడళ్లు, జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలు, సున్నిత ప్రాంతాలు, ఉత్సవాలు జరుగుతున్న ప్రదేశాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా డ్రోన్ నిఘాను విస్తరించారు. డ్రోన్ పర్యవేక్షణ ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించి నేరాలను అరికట్టడంతో పాటు అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని, తమ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్-100 లేదా 112కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.


# రెవెన్యూ భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



పుట్టపర్తి, జూలై 5 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్)లో సోమవారం (జూలై 6) జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్--పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత కార్యాలయాల్లో తమ వినతులను సమర్పించాలని కోరారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఎవవ-ఎశీయిఎ.ఖజా.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే దరఖాస్తు పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి కూడా సమాచారం పొందవచ్చన్నారు. మొదట సంబంధిత మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లోనే అర్జీలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలకు సంబంధించిన అర్జీదారులు మాత్రమే జిల్లా కేంద్రంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ భవన్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశించారు.

# మెడికల్ స్టోర్‌ను ప్రారంభించిన ఎస్ఐ సతీష్ కుమార్

నల్లమాడ, జూలై 5 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండల కేంద్రంలోని సత్యమ్మ సర్కిల్‌లో ఫార్మసిస్ట్ ప్రకాష్ నాయుడు ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతి మెడికల్ స్టోర్‌ను ఎస్ఐ సతీష్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ కుమార్, ఏఎస్ఐ సత్యనారాయణలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా



ఎస్ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ, నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని స్వయంకృషితో ఎదిగి, మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రకాష్ నాయుడు మెడికల్ స్టోర్‌ను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏఎస్ఐ సత్యనారాయణ, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు మాట్లాడుతూ, యువత తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, అరవింద్ బాబు, వేమన్న, గొర్ల నారాయణ, ప్రకాష్ నాయుడు, చంద్రబాబు నాయుడు, రంగప్ప, రఘునాథ నాయుడు, గంగాధరి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# కాశీ చేరుకున్న శ్రీ సత్యసాయి జిల్లా భక్తులు..

## -ఘనంగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక యాత్ర

కాశీ,(పుట్టపర్తి), అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొమ్మిరెడ్డి అరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న ఉచిత కాశీ--అయోధ్య ఆధ్యాత్మిక యాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. సుమారు 80 మంది భక్తులతో శుక్రవారం ప్రత్యేకంగా రైలు ద్వారా ప్రారంభమైన ఈ పవిత్ర యాత్ర ఆదివారం ఉదయం కాశీ నగరానికి చేరుకుంది. కాశీ చేరుకున్న భక్తులకు అక్కడ ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయడంతో వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విశ్రాంతి తీసుకునే అవకాశం లభించింది. కర్ణాటక రాష్ట్ర విశ్వహిందూ మహిళా అధ్యక్షురాలు చిన్నపరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో కాశీలోని కర్ణాటక జంగమ మఠంలో భక్తులకు విశాలమైన వసతి, పరిశుభ్రమైన భోజన సదు-



పాయాలు, తాగునీరు, విశ్రాంతికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. కాశీ విశ్వనాథుడి సన్నిధిలో జరిగే దర్శనం, గంగానదిలో పవిత్ర స్నానం, గంగా హారతి వీక్షణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు ఎంతో ఆసక్తిగా సిద్ధవవుతున్నారు. అనంతరం అయోధ్యకు చేరుకుని శ్రీరామ జన్మభూమి మందిరంలో శ్రీరామచంద్రుడిని దర్శించుకునేలా యాత్ర ప్రణాళికరూపొందించారు.

ఇలాంటి పవిత్ర క్షేత్రాల దర్శనం ప్రతి ఒక్కరి జీవితంలో మరపురాని అనుభూతిగానిలుస్తుందని, సామాన్య భక్తులకు ఉచితంగా ఈ యాత్రను ఏర్పాటు చేయడం అభినందనీయమని యాత్రికులు పేర్కొన్నారు. ప్రయాణంప్రారంభమైనప్పటి నుంచి భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న బొమ్మిరెడ్డి అరుణ్ కుమార్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాశీలో తమకు కల్పించిన వసతి, భోజనం, ఆతిథ్యం ఎంతో సంతృప్తినిచ్చాయని, చిన్నపరెడ్డి పద్మావతి అందించిన సేవలు ప్రశంసనీయమని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తులందరూసురక్షితంగా, ఆనందంగా ఆధ్యాత్మిక యాత్రను కొనసాగిస్తూ కాశీ విశ్వనాథుడి దర్శనానికి సిద్ధమవు తున్నారు.

# పీఏబీఆర్ ఇన్‌టేక్ వెల్‌పై మంత్రి పయ్యావుల కేశవ్ ఆకస్మిక తనిఖీ



అనంతపురం, జూలై 5 అనంత సూర్య : ఉరవకొండకు తాగునీటి సరఫరా జరుగుతున్న పీఏబీఆర్ డ్యామ్‌లోని శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్‌ను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా మోటార్లు నిలిపివేసి ఉండటంతో పాటు, అక్కడ ఒక్క అధికారి గానీ, సిబ్బంది గానీ లేకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎల్-నినో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న పరిస్థితుల్లో డ్యామ్‌లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఉరవకొండకు తాగునీటి సరఫరా చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర బాధ్యతారాహిత్యమని మంత్రి మండిపడ్డారు. తాగునీటి సరఫరా వంటి అత్యవసర అంశంలో ఇటువంటి అలసత్వాన్ని ఎట్టి పరిస్థితల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ విషయమై మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడి సంబంధిత ఓఅండ్ఎం అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యమని, ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు.

# 37 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 5 అనంత సూర్య: ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవడం తమ బాధ్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఆదివారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 16,00,447 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రమాదాలు తదితర ఆరోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని మంత్రి తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం అప్పుల పాలుకాకుండా ప్రభుత్వం అండగా



నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి సమర్థవంతంగా అమలవుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి వేగంగా స్పందించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ధర్మవరం నియోజకవర్గం నుంచి వచ్చే ప్రతి అర్హమైన సీఎంఆర్ఎఫ్ దరఖాస్తును ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, వీలైనంత త్వరగా మంజూరు అయ్యేలా తన కార్యాలయం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన అర్హులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జనతా వారధిలో ప్రజలతో ముఖాముఖి

అనంతరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన జనతా వారధి కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జనతా వారధి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నామని, ప్రజలకు సేవ చేయడమే తమ రాజకీయాల లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యేలా నిరంతరం కృషి చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



అనంతపురం, జూలై 5 అనంత సూర్య : పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, తమ తమ సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థులను తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

స్థానిక ఎన్‌జీఓ హోమ్ లో నిర్వహించిన "ఆత్మీయ గురు సత్కారం" కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వడ్డే వెంకట్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని, ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమన్నారు.

ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా రాత్రింబవళ్లు శ్రమించిన ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని గౌరవించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కటిక జయరాం మాట్లాడుతూ.. గత మే నెలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 63 మండలాల నుంచి సత్కరించామని తెలిపారు. విద్యను ప్రోత్సహించడం, ప్రతిభను గుర్తించి గౌరవించడం సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

అనంతరం ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు మాధవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, యుటీఎఫ్ నాయకులు రమణయ్య, పీఎస్‌హెచ్ఎం అధ్యక్షులు గోవిందరెడ్డి, ఆడిటర్ ఆంజనేయులు, ఆర్వీపీపీ అధ్యక్షులు యర్రిస్వామి, విజయ, విజయకుమార్, ఆంజనేయులుతో పాటు పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ప్రకాష్ రాజ్‌పై సుమోటో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

## బీజేపీ నాయకుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి



పుట్టపర్తి, జూలై 5 అనంత సూర్య: సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై సుమోటోగా కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌పై కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హిందూ ధర్మం, శ్రీరాముడు, సీతాదేవిపై అవమానకర వ్యాఖ్యలు చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రకాష్ రాజ్‌కు సంబంధించిన ఆడియో బయటకు రావడం ఈ వ్యవహారానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే దేశ ప్రధాని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ వ్యవహారానికి సహకరించిన వారందరిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.


# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



నల్లమాడ, జూలై 5 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం కొండకింద తాండాకు చెందిన జయరాం నాయక్ కుమారుడు నారాయణస్వామి నాయక్ (చిన్నా), కొత్తపల్లి తాండాకు చెందిన భాస్కర్ నాయక్ కుమార్తె లక్ష్మి తేజేశ్విని వివాహ వేడుకకు పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వివాహ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

## జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఈ.బి. దేవి



పుట్టపర్తి, జూలై 5 అనంత సూర్య: ఎస్ఐఆర్ కార్యక్రమం అమలుపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఈ.బి. దేవి ఆదివారం జిల్లా స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది ఎస్ఐఆర్‌లో పూర్తిస్థాయిలో నమోదు అయి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో నమోదు అయ్యేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రోజువారీ పురోగతి నివేదికలను సకాలంలో సమర్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌వోలు)తో సమన్వయం చేసుకుని గృహ సర్వేలో పాల్గొని కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పరిపాలన అధికారి గిరిజ మనోహర్, డెమో నాగరాజు, బలరాం రెడ్డి, వెంకటేష్, కిరణ్ కుమార్, ఖాజా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల భూ హక్కులకు మరింత భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం – మంత్రి ఎస్. సవిత




రొద్దం, జూలై 5 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం చిన్నమంతూరు గ్రామంలో రీసర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తైన సందర్భంగా రాజముద్రతో కూడిన 550 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రీసర్వే ప్రక్రియ ద్వారా గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం లభించడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కలుగుతాయని పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించిందన్నారు. రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు రైతుల భూ హక్కులకు మరింత భద్రతను కల్పించడంతో పాటు భవిష్యత్తులో మోసాలకు తావు లేకుండా చేస్తాయని తెలిపారు. రీసర్వే అనంతరం జారీ చేస్తున్న నూతన పాస్ పుస్తకాలతో బ్యాంకు రుణాలు, భూ రిజిస్ట్రేషన్లు, ఇతర ప్రభుత్వ సేవలను రైతులు సులభంగా పొందవచ్చన్నారు. గ్రామస్థాయిలో భూ రికార్డుల సవరణలు, మ్యుటేషన్ల కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్, అలాగే 'వన్ మంత్ -- వన్ కాన్‌స్టిట్యుయెన్సీ -- వన్ విలేజ్' కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారంతో పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, రొద్దం తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రెవె-న్యూ సిబ్బంది, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



చిలమత్తూరు, జూలై 5 అనంత సూర్య: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్, ఓటరు నమోదు అధికారి మౌర్య భరద్వాజ్ ఆదివారం చిలమత్తూరు మండలం కొడూరు గ్రామంలోని 223 నుంచి 229 వరకు పోలింగ్ స్టేషన్లలో క్షేత్ర-స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల నమోదు, ఆధార పత్రాల పరిశీలన, కుటుంబ సభ్యుల వివరాలు, నివాసం మారినవారు, మరణించిన ఓటర్ల నమోదును యాదృచ్ఛికంగా తనిఖీ చేశారు. అలాగే ఫ్యామిలీ మ్యాపింగ్ విధానాన్ని స్వయంగా చేసి చూపిస్తూ, వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయడం, డిజిటలైజేషన్‌లో పాటించాల్సిన జాగ్రత్తలపై బీఎల్‌వోలకు సూచనలు చేశారు. ప్రతి బీఎల్‌వో తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రత్యక్ష ధృవీకరణ అనంతరం మాత్రమే వివరాలను నమోదు చేయాలని, ఆధార పత్రాలను పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డిజిటలైజేషన్‌లో పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా పాటించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జూలై 14తో ముగియనున్నందున, ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించని అర్హులైన ఓటర్లు తమ సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించి అవసరమైన ఆధారాలతో వెంటనే ఫారమ్‌లు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మండల అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# బూదిగుమ్మలో 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' విజయోత్సవ సభ



పుట్టపర్తి, జూలై 4 అనంత సూర్య: రాయలసీమ సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ. 16,350 కోట్ల వ్యయంతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి కీలక మైలురాయిగా అభివర్ణించారు. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు శంకుస్థాపన చేసినప్పటికీ ప్లాంట్ నిర్మాణ పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. పరిశ్రమ స్థలంలో పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించే చర్యలు కూడా చేపట్టలేదని ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జీఓ నెం. 365 ద్వారా సుమారు 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసి రాయలసీమ రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రాయలసీమ వెనుకబాటుకు వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. ప్రస-్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రూ. 33 వేల కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపు లభిస్తోందని తెలిపారు. నీటి వనరుల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే పెనుకొండలో ప్రపంచ ప్రఖ్యాత కియా కార్ల పరిశ్రమ విజయవంతంగా కొనసాగుతోందని, పుట్టపర్తిలో రెండు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో ఐదో తరం ఫైటర్ జెట్ తయారీ పరిశ్రమ ప్రతిపాదన, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, చిత్తూరు--తిరుపతి జిల్లాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో ద్విచక్ర వాహనాల తయారీ యూనిట్లు, యాపిల్ ఫోన్ తయారీ పరిశ్రమలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు రాయలసీమను దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాయలసీమకు కొత్త దిశను చూపిస్తోందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, సీమ ప్రజలకు వైసీపీ ప్రభుత్వం ద్రోహం చేసిందని ఆమె విమర్శించారు.

# ప్రకాష్ రెడ్డి.. నీ పిచ్చి కూతలు సాగనివ్వం


## – టీడీపీ, టిఎన్ఎస్ఎఫ్ నేతల హెచ్చరిక



అనంతపురం, జులై 5 అనంత సూర్య : "తోపుదుర్తి రాజ్యాంగం పక్కన పెట్టి మాట్లాడు ప్రకాష్ రెడ్డి. రాజకీయ భవిష్యత్తు లేదనే భయంతో పరిటాల కుటుంబంపై, దళిత బిడ్డ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై పిచ్చి కూతలు కూస్తే నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్తారు" అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం వారు అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రకాష్ రెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. పరిటాల కుటుంబంపై విమర్శలు చేసే అర్హత ప్రకాష్ రెడ్డికి లేదని, 'అమ్మ డైరీ' పేరుతో మహిళల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసింది, ఆలమూరు సమీపంలో దళితులు, వాల్మీకుల భూములు బెదిరించి లాక్కుంది తోపుదుర్తి కుటుంబమే అన్నారు. రిజర్వాయర్ పేరుతో తోపుదుర్తి గ్రామంలో అక్రమంగా భూములను అడంగల్‌లో ఎక్కించుకుని ప్రభుత్వ డబ్బులు నొక్కేయాలని చూశారని, చివరికి ఊరి దేవర పండుగ కోసం వసూలు చేసిన రూ. 14 లక్షలను కూడా అక్రమంగా కాజేశారని సొంత గ్రామ-స్తులే అంటున్నారంటే వీరి బతుకు ఏంటో అర్థ-మవుతోందన్నారు. కష్టపడి, ఉద్యమాల ద్వారా ఎదిగిన దళిత నేత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వ్యంగ్యంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకోవడం, దాచుకోవడం తోపుదుర్తి నైజమైతే.. నిరంతరం ప్రజల కోసం శ్రమించడం ఎమ్మెల్యే రాజు శైలి అన్నారు. ఇంకోసారి ఇలాంటి తప్పుడు ప్రచారాలు, కారుకూతలు కూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

# మోసం.. BRO




- సైనిక్ పేరుతో నేటికీ సోషల్ మీడియాలో పబ్లిసిటీ
- అను'మతుల్లే'ని కోచింగ్‌ల పేరుతో వసూళ్ల దందా
- రఘూ తప్పుడు పనులను వెనకేసుకొస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్
- నామమాత్రపు నోటీసులతో సరిపుచ్చుతున్న జిల్లా విద్యాశాఖ
- హాస్టల్ గదులలో సంఖ్యకు మించి విద్యార్థుల చేరికపై పలువురి అసంతృప్తి
- పొంతనలేని ర్యాంకులు హై లెవెల్ ప్రచారంపై పలువురి ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ చొరవ చూపాలంటున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు

*అనంతపురం, జులై 5 అనంత సూర్య :*

మోసం బ్రో.. లేనిది ఉన్నట్లుగా చూపించుకుంటూ, అక్రమ సంపాదన కోసం తప్పటడుగులు వేస్తున్నావ్. 'ధనం మూలం ఇదమ్ జగత్' అన్నట్లుగా విద్యను వ్యాపారంగా మార్చేస్తూ.. పవిత్రమైన ఆ సైనిక్ పేరును నీ స్వలాభం కోసం జత చేసి ఆదిలోనే తప్పటడుగులు వేశావు. ఆ తప్పులకు మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వ అనుమతులు లేని మరికొన్ని కోచింగ్‌ల పేరుతో విద్యార్థుల నుండి చేస్తున్న వసూళ్ల దందాకు హద్దు అదుపు లేదట. అయితే ఏం చేసినా తనను కంటికి రెప్పలా ఓ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ కాపాడుతుందనే ఓ భ్రమలో ఆ స్కూల్ నిర్వాహకుడు రెచ్చిపోతూ.. విద్యాసంస్థకు వచ్చిన పొంతన లేని ర్యాంకులకు సైతం హైలెవెల్ ప్రచారం చేసుకుంటూ.. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను నిండా మోసం చేస్తున్నాడని అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఆ విద్యా సంస్థ నిర్వాహకుడు ఏమి చేసినా జిల్లా విద్యాశాఖ అధికారులకు విద్యార్థి నేతలు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. కంటి తుడుపు చర్యలతో నామమాత్రపు నోటీసులు జారీ చేస్తూ చేతులు దులుపుకోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇది ఏ పాఠశాలలో పలువురికి అర్థమై ఉంటుందనే 'అనంత సూర్య' పత్రిక భావిస్తుంది. **ఆ పాఠశాలకు సంబంధించిన కొన్ని విషయాలను లోతుగా పరిశీలిస్తే..**

### సైనిక్ పేరుతో లేని పేరును జత చేసి రఘు విద్యాసంస్థ మోసం..!

ఆ పాఠశాల వాస్తవ పేరు. ప్రభుత్వం నుండి అనుమతి పొందినది రఘు ఇంగ్లీష్ మీడియం స్కూల్. అయితే యాజమాన్యం మొదటి నుండి అన్ని రకాల మీడియాల్లోనూ, ఆఖరికి సోషల్ మీడియాలోనూ, నగరంలో పలుచోట్ల ఫ్లెక్సీలు వేసుకొని మరీ.. తప్పుడు ప్రచారంతో తొలి అడుగుల్లోనే మోసానికి పాల్పడింది. స్కూలు పాఠశాల పేరులోనే ఇంత మోసానికి తెగబడిన ఆ పాఠశాలకు వస్తున్న ర్యాంకులకు చేసుకుంటున్న ప్రచారానికి పొంతనే లేదని తెలిసింది.

### కోచింగ్‌ల పేరుతో వసూళ్ల దందా !

ప్రభుత్వ అనుమతులు లేకుండా సైనిక్ స్కూల్, నవోదయ, ఆర్ఎంఎస్, ఆర్ఐఎంసీ పేరుతో రఘు ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిర్వాహకులు రఘు చేస్తున్న మోసం అనిర్వచనీయమని తెలిసింది. ఆ కోచింగ్ ఇవ్వడానికి కూడా ఎలాంటి అర్హత లేకున్నా రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండడం ఒక ఎత్తు అయితే, హాస్టల్ పేరుతో మరో రకం మోసం చేస్తున్నారని తెలిసింది. హాస్టల్ గదిలోనూ సంఖ్యకు మించి విద్యార్థులను ఉంచడం, తక్కువ ర్యాంకులు వస్తే ఎక్కువగా వచ్చినట్లుగా చూపించుకోవడం, విద్యార్థులకు కనీసం మౌలిక వసతులు కూడా ఆ ప్రదేశాల్లో కల్పించకుండా ఇరుకైన తరగతి గదులు, హాస్టల్ గదుల్లోనూ సంఖ్యకు మించి విద్యార్థులను ఉంచడంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదేకాదు నేటికి కూడా మొదటి అడుగులోనే.. లేని సైనిక్‌ను ఉన్నట్లుగా రఘు సైనిక్ స్కూల్ పేరుతో సోషల్ మీడియా అంతటా ప్రచారం చేసుకుంటూ మోసం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే విషయంపై పలువురు విద్యార్థి సంఘం నాయకులు పలు మార్లు విద్యాధికారులకు ఫిర్యాదు చేయడం, వారు సైతం చర్యలు తీసుకున్నామంటే తీసుకున్నామన్నట్టుగా రెండుసార్లు నోటీసులు జారీ చేయడం కూడా జరిగిందని, రాజకీయ పలుకుబడి కారణంగా చర్యలు తీసుకోవడంలో మరో అడుగు ముందుకు వేయలేకపోతున్నామని, ఓ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కూడా వారికి అండగా ఉందని చెబుతుండడం గమనార్హం.

అయితే ఇంత మోసాలకు పాల్పడుతున్నా.. ఆ రఘు ప్రభుత్వ విద్యా నిబంధనకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లు అయితేనేమి, పాఠశాల ప్రాంగణంలోనే పాఠ్య పుస్తకాలు, పాఠ్య సామాగ్రి విక్రయాలు చేపడుతున్నా.. జిల్లాస్థాయి అధికారులు, జిల్లా విద్యాధికారులు అన్నీ తెలిసి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పాఠశాలకు సంబంధించిన మరింత సమాచారాన్ని, చేస్తున్న మోసాన్ని మరికొన్ని కథనాల్లో వివరించే ప్రయత్నం చేస్తాం.

# నంబులపూలకుంటలో భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు



నంబులపూలకుంట, జూలై 5, అనంత సూర్య న్యూస్:నంబులపూలకుంట మండల కేంద్రంలో మొహరం వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో,ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.ఆదివారం ఉదయం, సాయంత్రం సంప్రదాయబద్ధంగా పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేయడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.కోరిన కోర్కెలు తీర్చే హసేన్, హుస్సేన్,మౌలాలి స్వాములకు భక్తులు ప్రత్యేక ఫాతిహా చదివింపులు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.తమ కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా ముజావర్లు, భక్తులు స్వామివార్లకు పూల భాషకాలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పీర్ల దర్శనం కోసం మహిళలు, యువకులు,చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.వేడుకల సందర్భంగా మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం అనంతరం పీర్లు సంప్రదాయం ప్రకారం జలధికి తరలివెళ్లాయి. మొహరం వేడుకలు ప్రశాంతంగా, భక్తిపూర్వకంగా ముగియడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## రెడ్డిపల్లి లో మొహరం వేడుకలు ప్రారంభం



నల్లమాడ,జూలై 5, అనంత సూర్య న్యూస్:నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామం నందు వైభవంగా మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. పూర్వకాలంలో గ్రామం నలుమూలల గ్రామ పీర్లు వచ్చి వన్నూరు వలి స్వామి,మస్తాన్ స్వామి పీర్లను దర్శించుకునేవి. గ్రామ ప్రజలు మాట్లాడుతూ చిన్న సరిగెత్తు గురువారం ఉంటుంది. శుక్రవారం రాత్రి మస్తాన్వలి స్వామి మెరవన ఉంటుంది. ఆదివారం జల్జీ (మొహరం) ఉంటుంది. రెడ్డిపల్లి గ్రామంలో మొహరం లో ముఖ్యమైన ఘట్టం మస్తాన్వలి స్వామి మరియు వన్నూరువల స్వామి పీర్ల ఉరుసు సోమవారం ఉంటుంది అని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరూ ఉత్సాహంగా జరుపుకుంటామని తెలిపారు.

# రబీ సీజన్‌లో రాగుల సేకరణ విజయవంతం

## 2,472.750 మెట్రిక్ టన్నుల రాగుల కొనుగోలు



పుట్టపర్తి,జూలై 05, అనంత సూర్య న్యూస్:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగుల సేకరణ కార్యక్రమం జిల్లాలోని 12 మండలాల్లో విజయవంతంగా పూర్తయింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, మరియు చెల్లింపుల ప్రక్రియ అత్యంత సమర్థవంతంగా సాగింది.2,472.750 మెట్రిక్ టన్నుల రాగులు సేకరించబడ్డాయి.జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,015 మంది రైతుల నుండి ఈ కొనుగోళ్లు జరిగాయి.రాగుల సేకరణ ద్వారా రైతులకు సుమారుగా రూ. 12.08 కోట్లు చెల్లించడం జరిగింది.మొదట జిల్లాకు 1,500 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని కేటాయించారు.రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం అదనంగా మరో 1,010 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని పొడిగించింది.లారీల కొరత, ఇతర ఇబ్బందులు లేకుండా రికార్డు స్థాయిలో 2,472.750 మెట్రిక్ టన్నుల రాగులను సేకరించి లక్ష్యాన్ని చేరుకున్నారు.ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్ రాగుల కొనుగోలు ప్రక్రియ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం జూన్ నెలాఖరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారికంగా మూసివేసినట్లు అధికారులు తెలియజేశారు.గత ఏడాది (2025) సేకరించిన 735 మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ఈసారి జాయింట్ కలెక్టర్ వ్యూహాత్మక పర్యవేక్షణతో ఏకంగా 2,472.750 మెట్రిక్ టన్నుల రాగులను సేకరించారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 1,737.750 మెట్రిక్ టన్నులు (దాదాపు 236% పైగా) అధికం.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మిస్తాం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

<u>పీఎం ఆవాస్ యోజన పథకంపై అధికారులతో సమావేశం</u>

<u>11 వేల మంది లబ్ధిదారులను ప్రాథమికంగా గుర్తింపు</u>

<u>పథకంలో పొరపాట్లకు తావివ్వొద్దని అధికారులకు ఎమ్మెల్యే సూచన</u>



అనంతపురం, జులై 5 అనంత సూర్య : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంపై సమీక్ష చేశారు. ఇప్పటి వరకు ఇళ్లు లేని వారు ఎంత మంది ఉన్నారు.. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు. వంటి అంశాల గురించి ఆరా తీశారు. రాప్తాడు నియోజకవర్గంలోని 6 మండలాల్లో సుమారు 11 వేల మంది లబ్ధిదారులను ప్రాథమికంగా అర్హులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు గ్రామసభలు నిర్వహించి.. లబ్ధిదారులను గుర్తించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత సూచించారు. ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. గత ప్రభుత్వంలో లాగా ఎక్కడా పార్టీలు చూడమని.. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఇళ్లు లేని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానమంత్రి మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత వివరించారు.

# విద్యాలయాలంటే దేవాలయాలు.. ఇక్కడ రాజకీయాలు ఉండకూడదు






అనంతపురం, జులై 5 అనంత సూర్య : విద్యాలయాలంటే దేవాలయాలని.. ఇక్కడ రాజకీయాలు ఉండకూడదన్నదే మా ప్రభుత్వ ఉద్దేశ్యమని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం పేరూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో ఆమె విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు కూడా పాల్గొన్నారు. గతంలో పాఠశాల అభివృద్ధికి తనవంతు లక్ష రూపాయలు ప్రకటించిన ఎమ్మెల్యే సునీత అందుకు సంబంధించిన నగదును అందజేశారు. ఆ తర్వాత విద్యార్థులకు ఎంజేపీ పాఠశాల సొసైటీ మొదటిసారిగా ట్రాక్ సూట్, ట్రాక్ షూస్ తో పాటు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుక కిట్లను అందజేశారు. విద్యార్థులకు అందించిన కిట్లను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. ప్రతి ఒక్కరూ దీనిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. అనంతరం పేరూరు కు చెందిన రామాంజినేయులు పదవ తరగతిలో 580 కి పైగా మార్కులు సాధించగా రూ.10వేల చొప్పున పారితోషికం ప్రకటించారు. ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా విద్యార్థులకు ఆ నగదును అందజేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి కార్పొరేట్ కు ధీటుగా రాణించినందుకు వారిని అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ నసనకోట బాలికల పాఠశాల తరహాలోని ఇక్కడ కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ రెండు పాఠశాలలు జిల్లాకే కాకుండా రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు. విద్య కోసం ఈ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని.. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో లాగా రాజకీయాలకు తావు లేకుండా విద్యా కానుక కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఉన్న నాయకులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సునీత పిలుపునిచ్చారు.

## మాల గుండ్లపల్లి పీర్ల పండగలో తీవ్ర విషాదం

ముదిగుబ్బ,జులై 5, అనంత సూర్య న్యూస్: ధర్మవరం నియోజకవర్గం ధర్మవరం రూరల్ మండలం పరిధిలో ఉన్న మాల గుండ్లపల్లి గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా శనివారం రాత్రి పీర్ల పండుగ ఊరేగింపులో ముదిగుబ్బ మండలం లోని నల్లాయకుంటపల్లి గ్రామానికి చెందిన హరిజన రామాంజనేయులు తప్పెట కొడుతూ ఉండగా సమీపంలో ఉన్న ట్రాక్టర్ ఆకస్మికంగా అదుపుతప్పి అతనిపైకి దూసుకెళ్లడంతో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ సంఘటనలో మృతుని కుటుంబ సభ్యులు వీరి బంధువులతోపాటు గ్రామస్తులంతా కూడా తీవ్ర విషాదంతో మునిగిపోయారు విషయం తెలిసిన వెంటనే ధర్మవరం రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి మృతుడి శవాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405